క్లుప్తంగా

ఘనంగా లక్ష బిల్వార్చన



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాసంలోని మాసశివరాత్రిని పురస్కరించుకుని లక్షబిల్వార్చన కార్యక్రమాన్ని తొలిసారి ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన రాసమల్ల చంద్రకాంత్–దేవయాని దంపతులు, కుటుంబ సభ్యులచే లక్షబిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవచనము, మంటపారాధన, దీక్షాదారణ, మహన్యాసపారాయణం, ఏకాదశ రుద్రావారాభిషేక రుద్రహవనం, నిర్వహించారు.

నేటినుంచి కబడ్డీ, వాలీబాల్ పోటీలు

గార్ల: పీవైఎల్ మండల కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామంలో 5మండలాల స్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు పీవైఎల్ మండల కార్యదర్శి బి.మంగీలాల్ ఆదివారం వెల్లడించారు. నేడు ఉదయం 10గంటలకు క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు 99894 70999, 79952 55892 నంబర్లను సంప్రదించి తమ టీం ఎంట్రీలను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. గార్ల, బయ్యారం, డోర్నకల్, గూడూరు, ఇల్లెందు మండలాలకు చెందిన క్రీడాకారులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

అయ్యప్ప పడిపూజ



గార్ల: గార్లలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమాన్ని అయ్యప్ప మాలధారులు ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో 18 మెట్లను ఏర్పాటు చేసి పడిపూజ నిర్వహించి పడిని వెలిగించారు. పట్టణమంతా అయ్యప్ప నామ స్మరణలతో మార్మోగింది. కార్యక్రమంలో గురుస్వాములు వెంపటి దుర్గారావు, తోడేటి విజయరాముడు, టి.కొండల్‌రెడ్డి, పడిపూజ నిర్వహించగా, అయ్యప్పస్వాములు వీరబత్తిని రాము, వెంకటేశ్వర్లు, వెంకన్న, అరుణ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో కవితా గానం



పెద్దవంగర: మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మద్దెల సుధాకర్ విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో 'రేపటి తరం కోసం వివిధ రంగాల్లో ఈ తరం చేయాల్సిన మార్పులు' అను అంశంపై కవితా గానం చేశాడు. దీంతో ఆయనను ఘనంగా సత్కరించారు.

కవితా సంపుటి ఆవిష్కరణ

డోర్నకల్: విజయవాడలో ఆదివారం జరిగిన ప్రపంచ 6వ తెలుగు రచయితల మహాసభలో డోర్నకల్‌కు చెందిన డాక్టర్ విత్తనాల సుధాకర్ రచించిన కవితా సంపుటిని ఆవిష్కరించారు. మన్నెగూడెం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న విత్తనాల సుధాకర్ రచించిన కవితా సంపుటిని కవి, రచయితలైన సాధనాల వెంకటస్వామినాయుడు, లెనిన్ శ్రీనివాస్, రామయ్య ఆవిష్కరించారు.

ఆత్మీయ వీడ్కోలు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ టి.వెంకన్న వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ అయి వెళ్తున్న సందర్భంగా ఆదివారం ఆయనకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి, సిబ్బంది వెంకన్నను శాలువాతో సత్కరించి ఫొటోను బహూకరించారు.

నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్

- రూ.లక్షలు వెచ్చించి నిర్వహణను విస్మరించారు
- ఇబ్బందులు పడుతున్న రోగులు



నిరుపయోగంగా ఉన్న ఆక్సిజన్ ప్లాంట్



నిరుపయోగంగా పరికరాలు

గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలో లక్షలు వెచ్చించి ఆక్సిజన్ ప్లాంటు నిర్మించారు.. కాని దాని నిర్వహణను వదిలేయడంతో, ప్రస్తుతం ప్లాంటు నిరుపయోగంగా ఉంది. దీంతో సీహెచ్‌సీలో రోగులకు ఆక్సిజన్ సౌకర్యం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. కరోనా మహమ్మారిని దృష్టిలో పెట్టుకొని రోగులకు ఆక్సిజన్ సౌకర్యం కల్పించేందుకు నాటి ప్రభుత్వం 2 ఏళ్ల క్రితం గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలో సుమారు రూ.కోటి వ్యయంతో ఆక్సిజన్ ప్లాంటు నిర్మించింది. ప్లాంటుకు రేకుల షెడ్ నిర్మించి అందులో ప్లాంట్ ఎక్విప్‌మెంట్ ఫిట్టింగ్ చేశారు. ప్లాంటుకు ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం వైద్యశాఖ అధికారులు విద్యుత్‌శాఖకు డీడీ కట్టారు. అయినా విద్యుత్‌శాఖ నేటివరకు కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. ప్లాంటుకు తాళం వేసింది వేసినట్లుగానే ఉంది. ఇంత వరకు ప్లాంటు గది తాళం తెరుచుకోలేదు. ఇలాగే ఉంటే ఎక్విప్‌మెంట్ అంతా తుప్పుపట్టి పోయే ప్రమాదం ఉంది. లక్షలు వెచ్చించి నిర్మించిన ప్లాంటు ప్రభుత్వ ధనం గంగపాలు అయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ఆక్సిజన్ ప్లాంటు ప్రారంభించి ఆస్పత్రిలో రోగులకు ఆక్సిజన్ సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు డిమాండ్ చేశారు. ఇట్టి విషయంపై గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్‌గౌడ్‌ను 'సాక్షి' వివరణగా కోరగా ఆక్సిజన్ ప్లాంటుకు మైనర్ రిపేర్లు చేయాల్సి ఉంది. మరమ్మతులు పూర్తయిన వెంటనే ప్లాంటు ప్రారంభిస్తామని తెలిపారు.

బోనాలతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



బోనాలు సమర్పిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

మహబూబాబాద్ రూరల్: సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మెలో భాగంగా మానుకోటలోని ముత్యాలమ్మ తల్లికి ఆదివారం బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి మనసు మార్చి తమ వైపు చూసే విధంగా అనుగ్రహించాలని వేడుకున్నారు. సమ్మెలో భాగంగా రకరకాల వినూత్నమైన కార్యక్రమాలు చేస్తూ తమ నిరసన తెలియజేశామని, ముఖ్యమంత్రి తమను గుర్తించి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి న్యాయం చేయాలని కోరారు. పోతురాజు వేషధారణలో సీఆర్పీ వీరస్వామి, మాతంగి వేషధారణలో ఐఆర్పీ అనిల్ కుమార్ అందరిని అలరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు మహంకాళి వీరన్న, జీబీవీ ప్రత్యేక అధికారులు, ఉద్యోగులు, సింగర్ రాజశ్రీ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి

గార్ల: మండలంలోని చంద్రగిరి గ్రామ సమీపంలో రైతుల విద్యుత్ మోటార్లకు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని మండల విద్యుత్ అధికారులు 2 రోజుల నుంచి రైతులకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారని రైతు గంగావత్ మోతీలాల్ ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రగిరి గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద కొంతమంది రైతులు విద్యుత్ బిల్లులు కట్టారని, కొందరు రైతులు బిల్లులు చెల్లించక పోవడంతో విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో యాసంగి పంటకు వరిపంట సాగు చేసిన దుక్కులు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించని రైతులకు విద్యుత్ సరఫరా కట్ చేయాలి కాని బిల్లులు చెల్లించిన రైతులకు సైతం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తే ఎలా అని ఆయన విద్యుత్ సిబ్బందిపై మండిపడ్డాడు. బిల్లులు చెల్లించిన రైతులకు వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు

డోర్నకల్: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ పోరాడుతుందని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రెండో మెయిన్ రోడ్డులో ఆదివారం పార్టీ 99వ ఆవిర్భావం పురస్కరించుకుని పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నెల్లూరు నాగేశ్వర్‌రావు, తురక రమేష్, కె.ప్రభేష్, జన్ను స్వామి పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న వీరారెడ్డి

మహబూబాబాద్ అర్బన్: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ హైస్కూల్ గెజిటెడ్ హెచ్ఎం దళితుడు కంబాల రాములుపై ఉద్దేశపూర్వకంగా మతోన్మాదులు అయ్యప్ప భక్తుల ముసుగు వేసుకొని దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ అధ్యక్షుడు కల్లె వీరారెడ్డి డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట భగత్‌సింగ్ స్టడీ సర్కిల్, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో భగత్ సింగ్ స్టడీ సర్కిల్ గౌరవ అధ్యక్షుడు సోమ గోవర్ధన్, కోశాధికారి కొమిరె ఉప్పలయ్య, సభ్యులు గొర్రె శ్రీనివాస్, సురేందర్, నాయకులు హెచ్.లింగ్య, గుంజె హనుమంతు, మునీత, కల్పన పాల్గొన్నారు.

పింఛన్ రాక దివ్యాంగుల ఇబ్బందులు



సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

కురవి: సమస్యలను పరిష్కరించాలని సీపీఎం గ్రామ కార్యదర్శి పిట్టల వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం బలపాల శివారు లక్ష్మీతండాలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి వెళ్తే సమస్యలే స్వాగతం పలుకుతున్నాయన్నారు. సదరం సర్టిఫికెట్లు ఉన్నప్పటికి పింఛన్లు రాక దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాలోత్ కిషన్, పిట్టల మోహన్, గోపి, వెంకన్న, చెన్న బోయిన దర్గయ్య, లాలయ్య, ఉపేందర్, ఉపేంద్ర, నక్క వెంకటనారీ, రంగయ్య, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడి గుడ్డు ధర

- హోల్‌సేల్‌లో రూ.7, రిటైల్ మార్కెట్‌లో ఒకటి రూ.8కి విక్రయం



కోడి గుడ్లు

మరిపెడ రూరల్: రోజురోజుకు చికెన్ ధర పడిపోతుండగా కోడి గుడ్డు ధర మాత్రం ఎకబాకుతూ కొండెక్కుతుంది. గతంలో ఎన్నడు లేని విధంగా ఒక గుడ్డు ధర రూ.7కాగా, కిలో చికెన్ ధర రూ.190 తగ్గింది. శీతాకాలంలో గుడ్డు ధర పెరగడం సాధారణమే అయినప్పటికీ మరీ ఇంతగా పెరగడం అరుదని పలువురు అంటున్నారు. హోల్‌సేల్‌లో రూ.7ఉండగా రిటైల్ మార్కెట్‌లో గుడ్డును రూ.8కి విక్రయిస్తున్నారు. గుడ్డు ధర పెరగడంతో డజన్ కొనుగోలు చేసే వారు అర డజన్‌తో సరి పెట్టుకుంటున్నారు. ఈ నెలలో క్రిస్మస్ పండుగను భారీగా జరుపుకోగా, నూతన సంవత్సర వేడుకలను కూడా అదే తరహాలో జరుపుకోనున్నారు. దీంతో బేకరీ నిర్వాహకులు పెద్ద ఎత్తున కేక్‌లు తయారు చేసి విక్రయిస్తున్నారు. అయితే వాటి తయారీలో గుడ్డు వాడుతుంటారు. మరోవైపు ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లోని గుడ్డును భారీ స్థాయిలో వినియోగిస్తున్నారు. బయట, ఇంట్లో గుడ్డు వాడకం ఎక్కువ అవుతుంది. ప్రస్తుతం గుడ్డు ధర పెరగడంతో భారంగా మారిందని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికే మధ్యాహ్న బిల్లులు మంజూరు కావడం లేదు. ఇదే సమయంలో కోడి గుడ్ల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో మరింత భారంగా మారిందని మధ్యాహ్న భోజన కార్మికులు వాపోతున్నారు. కార్తీక మాసానికి ముందు కిలో చికెన్ ధర రూ.230నుంచి రూ.240 ఉండగా రోజు రోజు తగ్గుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో చికెన్ ధర రూ.190 విక్రయిస్తున్నారు. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చికెన్ వ్యాపారులు చెబుతున్నారు.

గుడ్డు ధర భారమైంది



మధ్యాహ్న బిల్లులు సమయానికి రాక ఇబ్బందులు పడుతున్నాం. భారీగా కోడి గుడ్డు ధరలు పెరగడంతో భారమైంది. అయిన తప్పని పరిస్థితిలో గుడ్లను కొనుగోలు చేసి వడ్డిస్తున్నాం. గుడ్డు ధర పెరిగినప్పుడు బిల్లులు కూడా పెంచి ఇవ్వాలి.

\- ఓర ఉపేంద్ర, మధ్యాహ్న భోజనవంట నిర్వాహకురాలు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



చిన్నగూడూరు: సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ చిన్నగూడూరుకు చెందిన విద్యార్థి పులిచందు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జక్కి నాగేశ్వర్ తెలిపారు. ఈనెల 19, 20, 21న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి పులి చందు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. ఈనెల 30, 31, జనవరి 1, 2న వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయిలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి చందును హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయులు అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కేసముద్రం: 1980-81 బ్యాచ్ విద్యార్థులు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కి చెందిన 1980–81 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. అప్పటి గురువులైన రాంచంద్రారెడ్డి, రావుల ఉపేందర్‌రెడ్డి, లక్ష్మణాచారిలను ఘనంగా సన్మానించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న రిటైర్డ్ టీచర్ భాస్కరాచారికి, భారత వాలీబాల్ జట్టు మాజీ కెప్టెన్ కన్నా వెంకట్‌నారాయణ రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.



మహబూబాబాద్ అర్బన్: తక్షశిల హైస్కూల్‌లో..

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని తక్షశిల హైస్కూల్ 2003–04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ దామోదర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సాబీర్, విష్ణువర్ధన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, శ్రీనివాస్, లక్ష్మి, రేణుకను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

గ్యారంటీలను గాలికొదిలేసిన కాంగ్రెస్



నియామక పత్రాన్ని అందజేస్తున్న మహేష్

కురవి: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను గాలికొదిలేసిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా 55వ బూత్ కమిటీ ఎన్నిక జరిగింది. బూత్ అధ్యక్షురాలిగా బోడ పుష్పను ఎన్నుకొని నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలం అయిందని తెలిపారు. రైతు రుణమాఫీ చేయలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరిధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజు, కొణతం పెంటయ్య, లావుద్య రమేష్ పాల్గొన్నారు.

శిలాఫలకంపై పేర్లు ధ్వంసం



ధ్వంసం చేసిన శిలాఫలకం చూపిస్తున్న కౌన్సిలర్ హరిసింగ్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు శనిగపురం గ్రామ చెరువు కట్ట వద్ద బతుకమ్మ విగ్రహాలు, మెట్లకు సంబంధించిన శిలాఫలకంపై పలువురి పేర్లను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారని స్థానిక వార్డు కౌన్సిలర్ బానోత్ హరిసింగ్ అన్నారు. శిలాఫలకంపై పేర్లు ధ్వంసం చేసిన ఘటనలో కౌన్సిలర్ బానోత్ హరిసింగ్ ఆదివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈసందర్భంగా హరిసింగ్ మాట్లాడుతూ.. శిలాఫలకంపై మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, తన పేర్లను ధ్వంసం చేయటం రాజకీయ కుట్రలో భాగమేనని పేర్కొన్నాడు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పద్మం ఉపేంద్రమ్మ, దుడ్డెల కొమురమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వాకింగ్ పోటీల్లో రెండో బహుమతి



నర్సింహులపేట: సీనియర్ సీటిజన్ 60నుంచి 70 సంవత్సరాల వయసు గల సీనియర్ సిటిజన్ వాకింగ్ పోటీల్లో నర్సింహులపేటకు చెందిన బోగి వెంకన్న రెండో బహుమతి గెలుపొందాడు. ఏలూరులో జరిగిన సీనియర్ సిటిజన్ వాకింగ్ పోటీల్లో ఆయన పాల్గొని బహుమతి గెలుపొందడంపై గ్రామస్తులు, స్నేహితులు, తోటి వాకర్స్ హర్షంవ్యక్తం చేశారు.

ప్రజానాయకుడు ధర్మన్న



నెహ్రూసెంటర్: పేదల ఇంటిస్థలాల కోసం వేల ఎకరాల భూములను భూపోరాటం ద్వారా పంపిణీ చేసిన ప్రజానాయకుడు అమరజీవి ధర్మన్న అని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. ధర్మన్న వర్ధంతి సందర్భంగా కొండపల్లి గోపాల్‌నగర్ కాలనీలో గల ఆయన స్థూపానికి ఆదివారం నివాళులర్పించారు. చింతకుంట్ల వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, వార్డు కౌన్సిలర్ బి.నీరజరెడ్డిధర్మన్న, ఎన్నారై బి.రంజిత్ రెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మీ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

మహబూబాబాద్ రూరల్: మద్యం తాగి వాహనాలు నడపొద్దు మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనదారులకు ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. వాహనాల పత్రాలు సరిగా లేనివారికి, మద్యం తాగి వాహనం నడిపిన వారికి జరిమానా విధించారు.

మండలస్థాయి పోటీలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కంకరబోర్డు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం 2గంటలకు మండలస్థాయి సాంఘికశాస్త్ర ప్రతిభ పాటవాలు నిర్వహిస్తున్నట్లు సోషల్ స్టడీస్ జిల్లా ఫోరం అధ్యక్షురాలు స్వరూపరాణి ఆదివారం తెలిపారు. ఈ పోటీలు ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు, తెలుగు మీడియం విద్యార్థులకు వేర్వేరుగా ఉంటాయన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు నిలిచిన విద్యార్థులు జనవరి 4న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్నాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు మండలస్థాయి సాంఘిక శాస్త్ర పోటీలకు సోషల్ ఉపాధ్యాయులతో హాజరుకావాలన్నారు,

క్యాలెండర్ ఆవిష్కరణ



కేసముద్రం: మండల కేంద్రంలోని అభ్యుదయ కూరగాయలు, పండ్లు ఉత్పత్తిదారుల సంఘం భవనంలో నూతన సంవత్సరం 2025 క్యాలెండర్లను సంఘం అధ్యక్షుడు పోలెపల్లి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, కోశాధికారి ఎలగలబోయిన అనిల్‌కుమార్, మార్తినేని పాపారావు, రాంరెడ్డి, ఆకుల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం సమీపంలో అగ్నిప్రమాదం

బయ్యారం: మండలంలోని నామాలపాడు సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో ఆదివారం మంటలు వ్యాపించాయి. కొనుగోలు కేంద్రం సమీపంలోని పంట పొలాల్లోని వరిగడ్డికి కొందరు రైతులు అంటించిన మంటలు కొనుగోలు కేంద్రం వద్దకు వస్తుండటంతో నిర్వాహకులతోపాటు రైతులు అప్రమత్తమయ్యారు. ఈ విషయాన్ని మహబూబాబాద్ అగ్నిమాపక వాహనం కేంద్రానికి తెలియజేయడంతో వాహనంతో వచ్చిన సిబ్బంది మహేష్, రమేష్, విశ్వనాథ్, స్వామి మంటలను ఆర్పేశారు. దీంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది.

పురుగుల మందుతాగి ఆత్మహత్య

నర్సింహులపేట: మండలంలోని కొమ్ములవంచ గ్రామానికి చెందిన డొనికని యాకయ్య (37) అనే వ్యక్తి పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్సై మాలోత్ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్ములవంచ గ్రామానికి చెందిన ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా ఇబ్బంది పడుతూ శనివారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పద్మశాలి సంఘం మండల కమిటీ ఎన్నిక



కేసముద్రం: మండల కేంద్రంలో పద్మశాలి సంఘం నూతన మండల కమిటీని సంఘం రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈమేరకు సంఘం మండల అధ్యక్షుడిగా దాసరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కాముని కుమారస్వామి, కోశాధికారి బొద్దుల సురేందర్‌లను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న, అల్వాల రామకృష్ణ, పెండెం రమేష్, చిట్యాల వీరన్న, చలమల్ల కిరణ్, ప్రకాష్, సమ్మయ్య పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

బయ్యారం: జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పెసర ప్రభాకర్‌రెడ్డిని బాల్యమిత్రులు సన్మానించారు. ఆదివారం బయ్యారంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ దేవేంద్రాచారి, రిటైర్డ్ హెచ్ఎం వెంకట్‌రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆర్.వి.ప్రసాదరావు, బస్వ వెంకన్న, మిత్రులు రచ్చ వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, వెంకటాచారి, సుదర్శనాచారి, శ్రీనివాస్, రాధాకృష్ణ, గోపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అండగా పీఏసీఎస్



సత్తార్‌ను సన్మానిస్తున్న పాలకవర్గం

డోర్నకల్: రైతులకు అండగా ఉంటూ ప్రభుత్వ పథకాలను పీఏసీఎస్‌ల ద్వారా అందిస్తున్నామని డోర్నకల్ పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి తెలిపారు. డోర్నకల్ పీఏసీఎస్‌లో సీఈఓగా విధులు నిర్వహిస్తూ ఈనెల 31న పదవి విరమణ పొందుతున్న సత్తార్‌ను పాలకవర్గం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శెట్టి వెంకన్న, సభ్యులు తవ్వ వరలక్ష్మి, చిక్కా సత్యనారాయణ, నూకల ఉపేందర్ పాల్గొన్నారు.